చూస్తోంది. ఆ ఎర్రటి గుడ్డను మళ్ళీ తిప్పుతూ ఎత్తు తగ్గిస్తూ క్రిందికి తీసుకు వచ్చాడు సైదులు. గిర గిర చుట్ట చుట్టుకుంటూ ఎర్రగుడ్డను తన దృష్టినుంచి తప్పించుకు పోనీడంలేదు. ఆ పాము పడగ ఎత్తు బుట్టకు సమానంకాగానే మూసేశాడు సైదులు.

హిప్నొటైజ్ చేయబడ్డ వాడిలా చూస్తూ వుండి పోయాడు శివరావు.

ప్రదర్శన ముగించిన తర్వాత అన్నాడు సైదులు

"ఎట్టా వుంది పాము?"

"చాలా పౌరుషం మీద వున్నట్టుంది"

"కూసం విడిచే టైము! అందుకే అలా చిరాగ్గా వుంది."

"అదీ మంచిదే. శివుడి మెళ్ళో పాము అలాగే వుండాలి. మరి విషం తీసేశావా? ఇంకా ఏమన్నా పాములుంటే చూపించూ. కొంచెం చిన్నవి. తక్కువ పౌరుషం వున్నవి."

"అన్నీ చిన్న పిల్లలండీ! బారెడు కూడా లేవు. మా తమ్ముడు మొన్నే మద్రాసు పట్టుకు పోయాడు. కొన్ని సినీమాలో ఇస్తాడు. కొన్నిటిని చంపి చర్మం అమ్ముతాడు. మీకు కావాలంటే ఒక కొండ చిలువ వుంది. అయితే బాగా బరువు. మెళ్ళో వెసుకోడం కష్టం..." సైదులు అన్నాడు.

శివరావు ఆలోచించాడు. నాటకం ఆగ కూడదు. నాటకం మీద వచ్చే వసూళ్ళతోనూ, శేషు పెట్టుబడితోను రోజులు సరదాగా గడిచి పోతున్నాయి. అయినా మెళ్ళో వేసుకుని నటించేది తనుకాదు కదా!

సైదులు పాము పెట్టిన బుట్టకి తాడు కట్టి శివరావుకు ఇచ్చాడు.

"రోజుకు ఏభై రూపాయలు. ముందు కొంత ఎడ్వాన్సు ఇవ్వండి!" సైదులు అన్నాడు.

"యాభైరూపాయలా. రోజుకు?... మాకే లేదు. హీరో హీరోయిన్లకు నెలకు మూడు వందలు. మిగిలిన వాళ్ళకు రెండు వందలు. ఈ పాము హీరో కేటగిరీలో తీసుకున్నా రోజుకు పది రూపాయల కన్నా ఎక్కువ చెయ్యదు."

"అయ్యా! రోజుకు అయిదొందలిస్తారండీ సినిమాల్లో. నాటకానికంటున్నారు కాబట్టే యాభై రూపాయలే!" బేరం చేస్తున్నాడు సైదులు.

"ఈ నాలుగు రోజులకు కలిపి గుత్త బేరం వంద. ఎడ్వాన్సుగా ఈ యాభై వుంచుకో! ఏమయ్యా! నువ్వు పాముల్ని తయారు చేస్తున్నావా? పట్టుకుంటున్నావా? ఏపుట్ట త్వవ్వినా పామేనాయే!"

సైదులు ఒప్పుకున్నాడు. అతడిచ్చిన పాము బుట్ట తీసుకో పోయి ఆగి పోయాడు శివరావు. ఏదో ఆలోచన వచ్చింది. సైదులుతో అన్నాడు.

"ఈ బుట్ట నీదగ్గరే వుంచు. నేనో గంటలో వస్తా."

* * *

జనరల్ స్టోరులో నుండి బయటకు వస్తూంటే నారాయణ కనపడ్డాడు శివరావుకు.

"ఇంకా తీసుకు రాలేదా? సాయంత్రం కుమార్ దానితో రిహార్సలు చెయ్యాలి?... పాము తీసుకు రావడం, మళ్ళీ జాగ్రత్తగా అప్పగించడం నీ బాధ్యత. చాలా జాగ్రత్తగా చెయ్యాలి"

"అందుకే గదా! ఈ ప్రయత్నం అంతానూ..."

* * *

స్టోరులో కొన్న నల్లదారం బయటకు తీశాడు, శివరావు. ఎనిమిది అడుగులకు ఒక పేట వేశాడు. అలా నాలుగయిదు పేటలు వేసి ఆదారాన్ని తాడులా పేనాడు. ఆ దారం ఒక చివర చిన్న నికిల్ రింగు కట్టాడు. అది సైదులికిచ్చి ఏం చెయ్యాలో చెప్పాడు. శివరావు చెప్పినట్టే చేశాడు సైదులు. తలకు కొంచెం దూరంలో ఆ నల్లదారాన్ని పాముకు ముడి వేశాడు, జారు ముడి. ఇంగ్లీషు 'ఎస్' ఆకారంలో దారాన్ని పాము శరీరం మీద తిప్పుతూ, నికిలు రింగు పాముతోక లోనికి పోనిచ్చి, నల్లదారాన్ని ఆ రింగుగుండా రానిచ్చాడు. చిన్నముడి వేశాడు.

నల్లటి శరీరంలో, ఆ నల్లదారం. తోక చివర రింగు ఆ పాము శరీరంలో భాగాలయి పోయినాయి.

బుట్ట తీసుకుంటూ అడిగాడు శివరావు.

"విషం పూర్తిగా తీసేశావా? సైదులూ!"

"అయబాబో అనుమానం! ఇప్పుడది చీమను కూడా కర్లేదండీ!"

"అదే చిత్రం! విషం వున్నా చీమని కరవ లేదు" అంటూ పాము బుట్ట పుచ్చుకుని బయటకు వచ్చాడు శివరావు.


అతనికి తెలియని విషయం ఒకటుంది.

ఆ పాములో విషం కొంచెం కూడా తీయబడ లేదు!

భయంకరమైన నల్ల త్రాచు అది!

చాలా ఫెరోషియస్‌గా వుంది!

నారాయణ సైదులుతో ముందే మాట్లాడాడు!



"ఈ బుట్ట చాలా జాగ్రత్తగా వుంచాలి. విషం తీసేసినా కాటు వేయవచ్చు. కూసం విడిచే సమయంట. బయటకు పారిపోవచ్చు. కూసం విడిచేటప్పుడు తన పెదాలను, నేలకేసో, ఏదైనా వస్తువుకేసో రాస్తుందిట. అలా పెదాల దగ్గర మొదలయిన కూసం కొంచెం కొంచెం వదుల్చుకుంటూ, తోక దగ్గర పూర్తిగా వదిలేస్తుందిట. పుట్టిన కొద్ది రోజులకే పాములు కూసం విడుస్తాయి. చిన్న పాములు పెరిగే దశలో ఎక్కువ సార్లు కూసం విడుస్తాయి, పెద్దవాటికన్నా" పాము బుట్ట ఒక చోట పెడుతూ రిహార్సలు హాలులో వున్న నారాయణకు చెప్పాడు.

పాముకు కట్టిన దారం సంగతి శివరావు చెప్ప లేదు. పాము బుట్ట తెరిచేముందు, ఎక్కువగా వున్న దారం వదులు చేయాలి. లోపల పెట్టినప్పుడు, ఆ దారాన్ని బుట్టపై భాగంలో ఎదురు పుల్లకు కట్టేయాలి. పొరబాటున పాము పారిపోయే వీలు లేకుండా నల్లదారంతో ఈ ఏర్పాటు చేశాడు శివరావు.

నాటకానికి ఇంకా ఆరు రోజులుంది!

* * **

పాము తెచ్చిన రెండో రోజు రిహార్సలుకు ఎవరూ రాలేదు, నారాయణ, కుమార్ తప్ప.

పొలంలో కాయలు దొంగతనం చేస్తున్న సంగతి శేషు పిన తండ్రికి తెలిసి పోయింది. చాలా పెద్ద ఘర్షణ అయింది శేషుతో. తన పోర్షను అయిపోయిందని మనోహరి రావడం లేదు. నారద పాత్రకు అంత ప్రాముఖ్యంలేదు నాటకంలో. అందుకని శివరావు రాలేదు.

నారాయణ మాత్రం వచ్చాడు.

నారాయణ లబ్బరు గ్లవ్స్ తొడుక్కున్నాడు, లూజ్‌గా పొడుగు చేతుల చొక్కా.

రిహార్సలు మొదలైంది పాముతో.

పాము ఎగిరెగిర పడుతోంది.

కుమార్ ఆ పామును చూడగానే మృత్యువుని చూసిన వాడిలా గడగడ వణికి పోయాడు.

"ఎందుకు భయపడతావ్! దీనిలో విషం లేదు." పామును తీసుకుని నారాయణ నవ్వుతూ కుమార్ మెడలో వేశాడు.

"ఈ వేషంలో మనోహరి నిన్ను చూస్తే ఎంతో సంతోషిస్తుంది... హ...హ...

వంటిమీద ప్రాకుతున్న పాముని బిగిసిపోయి చూస్తూ వుండి పోయాడు కుమార్.

* * *

ఇంకా అయిదు రోజులలో నాటకం!

రిహార్సలుకు అందరూ వచ్చారు కుమార్ తప్ప.

"పాముని చూసి భయపడి వుంటాడు... అందుకే పారి పోయాడు..." శేషు అన్నాడు.

"నాటకం ఆగి పోవలసిందేనా?" నారాయణ అడిగాడు.

"ఎందుకు ఆగుతుంది? నువ్వు శివుడిగా వేద్దువుగాని... కుమార్‌లా నువ్వు పిరికి వాడివి కాదుకదా!" శేషు అన్నాడు.

"అందుకు మనోహరి ఒప్పుకోవాలి కదా!" అనుమానంగా అన్నాడు నారాయణ.

మనోహరికి అంతా అయోమయంగా వుంది. కుమార్ ఎక్కడికి వెళ్ళాడు? పాముని చూసి నిజంగా భయపడ్డాడా? తనకి చెప్పకుండా వెళ్ళడే?

"మనోహరికి మాత్రం నాటకం ఆగిపోవాలని వుంటుందా?... శివరావ్! ఆ బుట్టలో పాముని తీసుకురా! నారాయణని పెట్టె చేద్దాం..." ఆజ్ఞ జారీ చేశాడు శేషు.

శివరావు పెట్టె దగ్గరకు నడిచాడు.

పెట్టె తెరిచాడు.

పాములేదు!

*   *   *

నాటకం ఆగి పోయింది. కుమార్ వెళ్ళిపోయాడు. పాము పారిపోయింది. కుమార్ లేకుండా మనోహరి నటించనంది.

"పోయిన పాముకి నేనేం చెప్పుకోవాలి. సైదులు కనిపిస్తే అడుగుతాడేమో!" శివ రావు శేషుతో అన్నాడు.

"ఆ సంగతి నాకు వదిలెయ్యి. నేనేదో సర్దుబాటు చేస్తాలే!" హామీ ఇచ్చాడు శేషు.

"శేషు బాబూ! మీ బాబాయిగారు పడిపోయారు. త్వరగా రండి... శేషు నౌకరు అరుస్తూ చెప్పాడు, అప్పుడే.

"ఓ మై గాడ్! మాకు చెడ్డ రోజులు వచ్చినట్లున్నాయి" శేషు ఇంటి వైపు పరుగెత్తాడు.

"తొందరగా వచ్చేయి. లేకపోతే సైదులు నా ప్రాణం తీసేస్తాడు పాము తిరికి ఇవ్వక పోతే" శివరావు, వెళ్ళిపోతున్న శేషుతో అన్నాడు.

పది రోజుల తర్వాత శేషునుంచి శివరావుకు పిలుపు వచ్చింది.

"శివరావ్! నాటకాలంటే నిజంగా గౌరవమున్నది నీకే! నేచురాలిటీ కోసం పాముని తీసుకు రమ్మన్నా... తీసుకు వచ్చావ్... పిరికి వాడయి కుమార్ పారి పోయాడు. మనోహరి నారాయణతో నటించడం లేదు. గూడెంలో ఎవరినో హీరోయిన్నును చేస్తే బాగుంటుందని అన్నావుట... ఇవాళే ఒక వంద ఇచ్చి దాన్ని బుక్ చెయ్యి. హఠాత్తుగా బాబాయి పాము కరచి పోవడంతో మన నాటకం వాయిదా పడింది. ఆ అమ్మాయికి ట్రైనింగు ఇచ్చి మూడు నాలుగు నెలల్లో మళ్ళీ వేద్దాం"

శేషు, ఇనప్పెట్టె వున్న గదిలోకి వెళ్ళాడు. వెనకాలే శివరావు వెళ్ళాడు. శేషు ఇనప పెట్టె తెరుస్తున్నాడు. అప్పుడు చూశాడు శివరావు మంచం క్రింద.

నల్లటిదారం..!

చివర నికిల్ రింగ్.

దానిపైన కూసం!

తప్పిపోయిన నల్లత్రాచుది.

శేషు డబ్బు తీసుకోకుండానే బయటకు పరుగెత్తాడు శివరావు.

వేగంగా పరుగెడుతున్నాడు.

ఇంటికి చేరుకున్నాడు.

ఒక్కొక్క విషయం శివరావుకి తెలుస్తోంది.

"పాముని తెచ్చింది సహజత్వం కోసమా?"

పెట్టెలో బట్టలు సర్దుకుంటున్నాడు.

"నారాయణ, శేషులు పథకం ప్రకారం కదా పాముని తీసుకు వచ్చింది?"

పెట్టె తీసుకుని, రూంకి తాళం వేశాడు.

"మనోహరిని సాధించడానికి కదా కుమార్ చేత పాముతో రిహార్సలు చేయించింది!"

ఆయాసపడుతూ పరుగెడుతున్నాడు, శివరావు బస్సు స్టాండుకు.

"శేషు బాబాయి, కుమార్‌లు, నారాయణకు, శేషుకు అడ్డం వున్నారు కదా!"

ఆయాస పడుతున్న శివరావుని విచిత్రంగా చూస్తూ కండక్టరు బస్సు ఎక్కించుకున్నాడు.

"తనని తెలివిగా వాడుకున్నారు; నారాయణ, శేషు."

బస్సు వేగంగా వెళ్ళిపోతోంది!

"పాము ప్రమాదకరమైంది కాదు. పాము కాటు అంత కన్నా కాదు. పాము కోరల్లో విషమే ప్రమాదమైనది!"

శేషు మాటలు గుర్తుకు వచ్చాయి శివరావుకి.

గుండె దడ తగ్గడం లేదు శివరావుకి.

నిలువెల్లా విషం వున్న అతి ప్రమాదకరమైన పాములనుండి దూరంగా పారిపోతున్నాడు శివరావు!

శేషు, నారాయణ రెండు పెద్ద పాముల్లా నాలుకలు చాచుకుంటూ తరుము కొస్తున్నారు. వారి చేతులు భయంకరమైన పాము పడగల్లా, గోళ్ళు విషపు అరలలా, ఒక్క గోళ్ళే కాదు, కళ్ళు, నోరు, ముక్కు, చెవులు, తల, శరీరం అన్నీ భయత్పోతాదకంగా వున్నాయి.

శివరావు కళ్ళు మూసుకుని కెవ్వున అరిచాడు!

*



ఆశ

నేను లైబ్రరీలో కూర్చుని చదువు కొంటున్నాను. ఓ కుర్రాడు నా దగ్గరకు వచ్చి "చిన్నతనంలో తక్కువ మార్కులు తెచ్చుకొన్న మేధావుల పేర్లు కొన్నింటిని మీరు చెప్పగలరా!" అని అడిగాడు.

"ఎందుకు!" అని అడిగాను.

"నాకు ఈ సారి పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయి అంకుల్! కనీసం ఆ మేధావుల పేర్లు చెప్తేనన్నా మా అమ్మా... నాన్నా నన్ను ఏమీ అనరేమోనని ఆశ!" దిలిపిగా బదులిచ్చాడు.

—జూపిటర్.


విద్యుచ్ఛక్తి సరఫరాకు తగిన సాధనము

ఏవన్‌ప్లాస్ట్®

రిజిడ్ పి.వి.సి.
కాండ్యూట్ పైపులు.
16 మి.మి నుండి
63 మి.మి. వరకు లభిస్తాయ.



MAP/A1/4484 TEL

IS : 2509

ఏ వన్ ఇండస్ట్రీస్

27/1 యూనిటి బిల్డింగ్స్ బెంగళూరు 560002 ఫోన్: 225283/224801